క్లుప్తంగా

మార్క్‌ఫెడ్ ద్వారా జొన్న కొనుగోళ్లు


మాట్లాడుతున్న అధికారులు

బోథ్: ప్రభుత్వరంగ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా జొన్న కొనుగోళ్లు చేపడుతున్నామని ఏడీఎం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం బోథ్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డిలో కలిసి మాట్లాడారు. ప్రైవేట్ వ్యాపారులు రైతుల వద్ద నుంచి జొన్న కొనుగోళ్లు చేయొద్దన్నారు. రైతులు మార్క్‌ఫెడ్‌కు జొన్నలను విక్రయించాలన్నారు. వ్యాపారులు జొన్నను మార్కెట్‌కు తీసుకువస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి నారా మనోహర్ తదితరులు ఉన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఇంద్రవెల్లి: వేసవిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కోఆర్డినేటర్ గుంజాల రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని భీంనగర్‌లో ప్రజలు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం కళాకారులు అవగాహన కల్పించారు. అదేవిధంగా పారిశుధ్యం, స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కళాకారులు చహకటి రవి, కుమ్ర నగేశ్, ఆత్రం గోవింద్, రాథోడ్ శంకర్, ఆశిష్, మురళీ, రాజు, శ్రావణ్, నరసమ్మ, శ్రీలత తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


సైనిక్ సిక్సర్ జట్టు సభ్యులకు నగదు అందజేస్తున్న తొడసం శంకర్

నేరడిగొండ: చదువుతో పాటు యువత క్రీడల్లోనూ రాణించాలని యువ నాయకుడు తొడసం శంకర్ అన్నారు. మండలంలో ఈనెల 18 నుంచి నేరడిగొండ ప్రీమియర్ లీగ్ జరగనుండగా మంగళవారం లీగ్‌లో పాల్గొనే సైనిక్ సిక్సర్స్ జట్టు సభ్యులకు క్రీడాదుస్తుల కోసం రూ.10వేల నగదు అందజేశారు. జట్టు కెప్టెన్ మణిరాజ్, లీగ్ నిర్వాహకులు జాదవ్ పవన్ కుమార్, లఖన్, అనిల్, దినేష్,యోగి, గణేశ్, సిద్ధూ, ఆదిత్య, సునీల్, సతీశ్, నరేందర్, చిన్న, సాయి, సురేశ్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి నవరాత్రి ఉత్సవాలు


స్వామివారు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగాపూర్ గ్రామాల సమీపంలో కొండగుహలో స్వయంబుగా వెలసిన అక్కకొండ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో మంగళవారం నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చందనోత్సవం, కలశాభిషేకం, శ్రీ తులసీ అర్చన, లక్ష్మీనరసింహ స్వామి నామార్చనలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు వొద్దిపర్తి వెంకటరమణాచార్యులు తెలిపారు. ఈనెల 22 వరకు నవరాత్రి ఉత్సవాలు కొనసాగనున్నాయి.

'బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి'

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాజిదొద్దీన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో నిర్వహించారు. ఖానాపూర్‌లో పోలింగ్‌కేంద్రం వద్ద మాజీమంత్రి జోగు రామన్నను కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. రామన్న హయాంలో ఆదిలాబాద్ అభివృద్ధి చెందిందని తెలిపారు. గత పదేళ్లలో అన్నివర్గాల సంక్షేమం కోసం కృషి చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వందరోజులు దాటినా ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదన్నారు.

స్కాన్ చేయండి.. కథలు వినండి

- విద్యార్థుల్లో పఠన నైపుణ్యం పెంపొందించేలా విద్యాశాఖ కసరత్తు
- క్యూఆర్ కోడ్‌తో నవలలు, కథలు
- ఫోన్ చేసి కూడా..
- వేసవి సెలవుల్లో సద్వినియోగం చేసుకోవాలి


ఫోన్ చేసి కథలు వినండి పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు..ఎండలు ముదురుతున్నాయి. విద్యార్థులు, చిన్నారులు బయటకు వెళ్లకుండా ఉండేలా తల్లిదండ్రులు నానా తంటాలు పడుతున్నారు. ఆరుబయట ఆడుతూ అనారోగ్యం బారినపడుతున్నారు. అయితే, విద్యార్థుల్లో పఠనస్థాయిని పెంపొందించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేలా నవలలు, కథలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చదివేలా 'రూమ్ టు రీడ్' సంస్థ ద్వారా అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకే కాల్ చేసి కథలు వినండి..అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా, తాజాగా స్కాన్ ద్వారా కూడా నవలలు, కథలు వినేలా చర్యలు చేపట్టింది. దీంతో విద్యార్థులు చదవడం, రాయడం, మాతృభాషలో స్పష్టంగా మాట్లాడే విధంగా చూస్తుంది. విద్యార్థులకు ఆకర్షణీయమైన అభిరుచిని తీసుకొచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించింది.

ఆరుబయట తిరగకుండా..

ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ప్రతిఒక్కరూ వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. పిల్లలు ఆరుబయట ఆడుకోకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడనుంది. అయితే, చాలామంది పిల్లలు సెల్‌ఫోన్‌లో గేమ్‌లు, ఇతర బొమ్మలు చూస్తూ అతుక్కుపోతున్నారు. అదేవిధంగా టీవీ దగ్గర నుంచి కదలకుండా ఉంటున్నారు. ఇదివరకు పిల్లలు క్రికెట్, కోతికొమ్మచ్చి, కబడ్డీ, కర్ర బిళ్లా తదితర ఆటలు ఆడేవారు. వాటన్నింటిని మరిచి సెల్‌ఫోన్లతోనే గడుపుతున్నారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు విద్యాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇంటి వద్దే ఆహ్లాదంగా గడిపేందుకు నిర్దేశించిన లిట్రసి క్లౌడ్ క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయడం ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్తుంది. అక్కడ కథలు, నవలలు, సందేశాత్మక చిత్రాలు దర్శనమిస్తాయి. దీనిద్వారా విద్యార్థుల్లో పఠనశక్తి పెరుగుతుంది. //httpliteracycloud.org/stories?language= telugu& short= new%20arrivals లింక్ ద్వారా కూడా సమాచారం తెలుసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

Room to Read
లిటరసీ క్లౌడ్
స్కాన్ చేయండి - చదవండి - నేర్చుకోండి

స్కాన్ చేసి కథలు వినండి క్యూఆర్ కోడ్

విద్యార్థుల్లో పరిజ్ఞానం పెంచేలా..

విద్యార్థుల్లో పఠన ఆసక్తి పెంపొందించేందుకు రూమ్‌టు రీడ్ ఇండియా ట్రస్ట్ ద్వారా స్కాన్ చేసి కథలు వినే అవకాశాన్ని కల్పించాం. దీంతో విద్యార్థుల్లో పరిజ్ఞానం పెరుగుతుంది. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. 04045209722కు ఫోన్ చేసి కూడా కథలు వినవచ్చు.

– శ్రీకాంత్‌గౌడ్, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి

స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలి

ఆదిలాబాద్‌టౌన్: సేవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. మంగళవారం సఫా బైతుల్ మాల్ ఆధ్వర్యంలో రిమ్స్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో రోగుల సహాయకుల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. అదేవిధంగా రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సఫా బైతుల్‌మాల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న ఖుషి రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: డీఎంఎహెచ్‌వో నరేందర్ రాథోడ్ కూతురు ఖుషి రాథోడ్ తన జన్మదినం సందర్భంగా రక్తదానం చేశారు. జిల్లాకేంద్రంలోని రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం స్వచ్ఛందంగా రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఆమె ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అనంతరం రిమ్స్ ఆవరణలోని సత్యసాయి నిత్యాన్నదాన సత్రంలో రోగి సహాయకులకు భోజనం వడ్డించారు. రక్తదానం చేసిన ఆమెను తండ్రి డీఎంహెచ్‌వో, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అభినందించారు. రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, రిమ్స్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, సినీనటుడు అభినవ్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ భద్రత దళాల అధికారులకు సత్కారం


అసిస్టెంట్ కమాండెంట్‌కు సన్మానం చేసి మెమెంటో అందజేస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బందోబస్తు చర్యలు నిర్వహించడానికి బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి వచ్చిన కేంద్ర భద్రతా బలగాలను మంగళవారం బుధాగెస్ట్ హౌజ్ ఆవరణలో సత్కరించారు. బీఎస్ఎఫ్ జీకాయ్, 160 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ డేవిడ్ లాల్‌కు సీపీ తరపున బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి శాలువా కప్పి ఆత్మీయ సత్కారం చేశారు. మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా బీఎస్ఎఫ్ భద్రతా దళాలు రామగుండం బెటాలియన్‌కు వచ్చినట్లు తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అత్యంత సమర్థవంతంగా బీఎస్ఎఫ్ బలగాలు విధులు నిర్వర్తించాయని పేర్కొన్నారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దిన్, తాళ్లగురిజాల ఎస్సై నరేశ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి


జగదాంబదేవి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని రోడ్‌సవర్గాం గ్రామంలో జగదాంబ దేవి పూజ కార్యక్రమాన్ని గ్రామస్తులు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి భావనను అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. మాజీ సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్, ఎంపీపీ రాథోడ్ సజన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సిరిచెల్మ ఆలయంలో పూజలు

నేరడిగొండ: ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూజలు నిర్వహించారు. మంగళవారం ఆయన పెళ్లి రోజు కావడంతో పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించినట్లు తెలిపారు.


సిరిచెల్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ప్రాజెక్టు నీటిమడుగులో చేపల వేట

తాంసి: వేసవి తీవ్రతకు చెరువులు, వాగులు, ప్రాజెక్టులు నీరు లేక పూర్తిగా ఎండుముఖం పట్టాయి. మండలంలోని వడ్డాడి వద్ద గల మత్తడివాగు ప్రాజెక్టులో పూర్తిగా నీరు తగ్గింది. అక్కడక్కడ నీటి మడుగుల్లో ఉన్న చేపలు పట్టుకోవడానికి స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. గుంజాల గ్రామానికి చెందిన పలువురు ప్రాజెక్టులోని నీటి మడుగుల్లో చీరల సాయంతో చేపలు పట్టుకున్నారు.

రోడ్డుపైనే పార్కింగ్

- తరచూ ట్రాఫిక్ సమస్యలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

నార్నూర్: మండల కేంద్రమైనప్పటికీ వాహనాల నిలుపుదల (పార్కింగ్) కోసం ఇబ్బందిగా మారింది. వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నప్పటికి పార్కింగ్‌కు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం స్థానికులకు శాపంగా తయారైంది. కొందరు వ్యాపారులు దుకాణాల ముందు ఉన్న మురుగుకాలువలను ఆక్రమించి షెడ్లు నిర్మించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో వాహనాలు రోడ్డుపై నిలపాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా రహదారి ఇరుకుగా మారి తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

చర్యలు తీసుకోకపోవడమే కారణం..

మండల కేంద్రంలో కొత్తగా భవన, వ్యాపార సముదాయాల నిర్మించేవారు పార్కింగ్ కోసం ఇలాంటి చర్యలు తీసుకోవడం లేదు. నిబంధనల మేరకు నిర్మాణాలు చేపడితే కొంతమేర వాహనాల నిలుపుదలకు స్థలాలు ఉండేవి. భవనం ముందు కనీసం ఐదు అడుగుల ఖాళీ స్థలాన్ని వదిలిపెట్టకుండా మురుగుకాలువలకు అనుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇది యథేచ్ఛగా కొనసాగుతోంది.

రాకపోకలకు ఇబ్బంది

వ్యాపారకేంద్రాల ముందు కొంతమేరైనా స్థలం వదలకపోవడంతో స్థానిక మసీదు నుంచి గాంధీ చౌక్, అంబేద్కర్‌చౌక్ కోసం తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. రోడ్లకు ఇరువైపులా బైక్‌లతోపాటు ఆటోలు, జీపులు నిలుపుతున్నారు. ప్రధాన కూడలి గాంధీచౌక్ వద్ద ఇష్టానుసారంగా వాహనాలు నిలపడంతో వివిధ పనుల నిమిత్తం మార్కెట్ వచ్చే ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది. పెద్ద వాహనాలు వస్తే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఆటోలు, జీపులు విచ్చలవిడిగా రోడ్లపై నిలపడంతో బైక్ వెళ్లలేని పరిస్థితి. కళ్లముందే సమస్యలు ఉన్న పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


నార్నూర్‌లోని ఎస్బీఐ వద్ద రోడ్డుకు ఇరువైపులా వాహనాలు

స్పందించాలి



నార్నూర్‌లోని ప్రధాన మార్గాల్లో పార్కింగ్ స్థలాలు లేవు. ఓ దుకాణం వద్దకు వస్తే పార్కింగ్ స్థలం లేక ఇబ్బందవుతుంది. రోడ్డు పక్కనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

– పేందూర్ దీపక్, జైభారత్ అధ్యక్షుడు

పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి



ప్రధాన రోడ్డు మార్గంలో ఇరువైపులా దుకాణాలు ఉండడంతో కొనుగోలుదారులు వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మరోవైపు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. గాంధీచౌక్, గాదిగూడ రోడ్డు మార్గం ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి.

– మెస్రం దేవురావు, లోకారి(కే)

చర్యలు తీసుకుంటాం



మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుదల చేస్తే జరిమానా విధిస్తాం. పత్యేక పార్కింగ్ స్థలం కోసం ప్రయత్నం చేస్తాం.

– రవికిరణ్, ఎస్సై, నార్నూర్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాంసి: భీంపూర్ మండలంలోని పలు గ్రామాలతోపాటు తాంసి, తలమడుగు మండలాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని భీంపూర్ ఏఈ శ్రావణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. భీంపూర్ మండలానికి విద్యుత్ సరఫరా చేసే 33కేవీ లైన్‌లో స్తంభాలు ఏర్పాటు దృష్ట్యా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

యోగ శిక్షకుడికి ఎమ్మెల్యే ప్రశంస


పోతన్నను అభినందిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్: మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన రాటి పోతన్న అంతర్జాతీయ గుర్తింపు పొందిన యోగ శిక్షణ సంస్థ ఎస్ వ్యాస యోగ యూనివర్సిటీలో వంద రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నారు. దీంతో యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ పొందగా..ఈ మేరకు ఎమ్మెల్యే రామారావుపటేల్ అభినందించారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఎమ్మెల్యేను కలువగా.. శాలువాతో సత్కరించారు. యూనివర్సిటీ నుంచి వచ్చిన సర్టిఫికెట్ అందజేసి అభినందించారు.

హమాలీలుగా తీసుకోండి

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీలో జొన్న కొనుగోళ్లలో 12 మంది హమాలీలను తీసుకోవాలని మంగళవారం మార్కెట్ కమిటీ కార్యదర్శి నారా మనోహర్‌కు విన్నవించారు. తమకు లైసెన్సులు కల్పించాలని కోరారు. తాము హమాలీలుగా అర్హులమని పేర్కొన్నారు.

'ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి'

ఖానాపూర్: వడ్డెర కులస్తులపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వడ్డెర సంఘం సోషల్‌మీడియా రాష్ట్ర కన్వీనర్ బోసు రాము డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎస్టీలుగా ఉన్న వడ్డెరలను బీసీలో చేర్చడంతో అణచివేతకు, అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్‌లో ఒడ్డెర కులస్తులపై చేసిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ మర్రిచెట్టు హనుమాన్ ఆలయంలో మంగళవారం ఆలయ రెండో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నుంచి పంచమృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వ్యాపారి ముత్యం సంతోష్ గుప్తా, మాజీ కౌన్సిలర్ డి.శ్రీనివాస్, అర్కరీ రాజేందర్, రాము, కాల నీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శాంభవి కంటి ఐ విజన్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. సింగరేణి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి 50 మంది హాజరు కాగా వీరిలో ఐదుగురికి కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిని శస్త్ర చికిత్స కోసం వివిధ ఆసుపత్రులకు సిఫారసు చేశారు. ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించారు. కంటి వైద్యనిపుణుడు కొంకటి అంజయ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సింగరేణి లయన్స్‌క్లబ్ సెక్రెటరీ వంగల చక్రపాణి, పెద్ది రాజేందర్, నల్మాస్ సంతోష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


నజీమ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ముధోల్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎస్.కే నజీమ్ మంగళవారం మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ ఘనంగా సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సోషల్‌మీడియాలో కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముఖ్యపాత్ర పోషించినందుకు అభినందించాడు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బెజ్జంకి ముత్యంరెడ్డి, అజీజ్, దిగంబర్, అబ్దుల్‌వాజ్ పాల్గొన్నారు.